ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

5

తమిళనాడు

TAMILNADU

బుధవారం 7 ఫిబ్రవరి 2024



కొత్త పార్టీ దిశగా విశాల్?



నటుడు విశాల్

ప్యారీస్, ఫిబ్రవరి 6: యువ నటుడు విశాల్ కూడా రాజకీయ అరంగేట్రం చేయనున్నారా?.. ఆయన కూడా నటుడు విజయ్ బాట పట్టనున్నారా?.. త్వరలోనే కొత్త పార్టీ స్థాపించేందుకు కసరత్తు మొదలుపెట్టారా?.. అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. 'తమిళగ వెట్రి కళగం' పేరుతో ఇటీవల కొత్త పార్టీ ప్రారంభించిన నటుడు విజయ్ రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన బాటలోనే విశాల్ కూడా రాజకీయ పార్టీ త్వరలోనే ప్రారంభించే పనుల్లో దిగారని, ఆయనకు రాజకీయాలపై ఉన్న ఆసక్తే కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఉత్తర చెన్నైలోని ఆర్కే. నగర్ శాసనసభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు విశాల్ సమర్పించిన నామినేషన్ పత్రాలు తోసివేతకు గురైన విషయం తెలిసిందే. దీంతో తన అభిమాన సంఘాన్ని ఆయన 'విశాల్ మక్కల్ నల ఇయక్కం'గా పేరు మార్చి జిల్లాలవారీగా నిర్వాహకులను, బూత్ కమిటీలను కూడా నియమించారు. పలు ప్రాంతాల్లో జరిగే షూటింగుల్లో పాల్గొంటున్న విశాల్.. ఆ ప్రాంతంలో ఉన్న అభిమానులతో సమావేశం కావడంతో పాటు గ్రామ ప్రజలను పలకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుండడంతో రాజకీయ పార్టీని ప్రారంభించే దిశగా విశాల్ అడుగులేస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తన అభిమానులను త్వరలో చెన్నైకి ఆహ్వానించి, వారితో చర్చించిన మీదట.. పార్టీ ఏర్పాటుపై నిర్ణయం తీసుకొనే అవకాశముందని విశ్వసనీయంగా తెలిసింది.



రోడ్డురోకోలో స్థానికులు

ఆ ఫ్యాక్టరీని మూసేయండి

● విషవాయువు వెలువడుతోందంటూ 33 గ్రామాల ప్రజల ఆందోళన

అడయార్, ఫిబ్రవరి 6: తిరువళ్లూరు జిల్లా ఎన్నూరు సమీపంలోని పెరియకుప్పం వద్ద విషవాయువు వెలువరించిన ప్రైవేటు కర్మాగారాన్ని మూసివేయాలని డిమాండ్ చేస్తూ చుట్టుపక్కల 33 గ్రామాల ప్రజలు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఇందులోభాగంగా ఆ గ్రామాల్లో దుకాణాలను మూసివేశారు. అయితే ఆందోళన కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బలగాలను భారీగా మోహరించారు. ఇటీవల ఈ కర్మాగారం నుంచి అమ్మోనియా వాయువు వెలువడడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజల్లో అనేక మంది అస్వస్థతకు లోనైన విషయం తెలిసిందే. వాంతులు చేసుకోవడం, శ్వాసపీల్చడంలో ఇబ్బందులు తలెత్తడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు ఏర్పడ్డాయి. వీరిలో పలువురిని ఆస్పత్రికి తరలించారు. ఈ విష వాయువు లీకేజీపై గ్రీన్ ట్రిబ్యునల్ విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో ఈ కర్మాగారాన్ని శాశ్వతంగా మూసివేయాలని కోరుతూ 33 గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తున్నారు. ప్రతి రోజూ ఒక్కో గ్రామానికి చెందిన ప్రజలు ఆందోళనలో పాల్గొంటున్నారు. ఇలా ఈ గ్రామ ప్రజలు చేపట్టిన ఆందోళన మంగళవారానికి 42వ రోజుకు చేరుకుంది. అయితే, ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో మంగళవారం దుకాణాలను మూసివేసి బంద్ పాటించారు. దీంతో దాదాపు వెయ్యికిపైగా దుకాణాలు మూతపడ్డాయి. మరోవైపు అన్నై శివగామి నగర్, తాళకుప్పం, పెరియకుప్పం, చిన్నకుప్పం తదితర జాలరి గ్రామాలకు చెందిన ప్రజలు మంగళవారం ఉన్నట్టుండి రోడ్డురోకోకు దిగారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత స్థానిక అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు ఆందోళనకారులకు సర్ది చెప్పడంతో వారు విరమించుకున్నారు.



మూతబడిన దుకాణాలు

రాష్ట్రంలో ఎడిబాన్ కంపెనీ పెట్టుబడి రూ.540 కోట్లు

సీఎం సమక్షంలో ఒప్పందం ● నేడు చెన్నైకి స్టాలిన్



సీఎం స్టాలిన్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్న ఎడిబాన్ సంస్థ ప్రతినిధి

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యా సంబంధిత పరికరాలను ఉత్పత్తి చేయడంలో ఖ్యాతి గడించిన స్పెయిన్ కంపెనీ ఎడిబాన్ రాష్ట్రంలో రూ.540 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పెయిన్ పర్యటనను ముగించుకుని స్వరాష్ట్రానికి బయలుదేరనున్న సమయంలో మంగళవారం ఉదయం స్పెయిన్‌కు చెందిన సుప్రసిద్ధ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు ఆయనతో భేటీ అయ్యారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ నగరంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో వాహనాల విడిభాగాల తయారీలో పేరుగడించిన గెస్టాంప్ సంస్థ ఇంజనీరింగ్ రూపకల్పన సాంకేతిక విద్యా పరికరాలను తయారు చేసే ఎడిబాన్ సంస్థ రైళ్ల ఉత్పత్తిలో పేరుగడించిన టాల్గో సంస్థ, ఉన్నసాంకేతిక ఇంజనీరింగ్ వస్తువుల పరిశోధనలు, ఉత్పత్తులు చేసే మేప్‌ట్రీ సంస్థ తదితర సంస్థల ఉన్నతస్థాయి ప్రతినిధులు స్టాలిన్‌తో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా తమిళనాట కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, ఏకగవాక్ష లైసెన్సింగ్ విధానం గురించి సమగ్రంగా వివరించారు. కొత్త పరిశ్రమలకు కల్పిస్తున్న రాయితీలను పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎడిబాన్ సంస్థ ప్రతినిధులు రూ.540 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించారు. ఆ మేరకు ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో ఆ సంస్థ ప్రతినిధులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.విష్ణు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ బి.ఉమానాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చెన్నైకి రాక...

పారిశ్రామిక పెట్టుబడుల సమీకరణ కోసం స్పెయిన్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన పది రోజుల పర్యటనను ముగించుకుని బుధవారం చెన్నైకి చేరుకోనున్నారు. జనవరి 28 రాత్రి చెన్నై నుంచి విమానంలో బయలుదేరిన స్టాలిన్ తొలుత దుబాయ్ వెళ్లి అక్కడి నుంచి మరో విమానంలో స్పెయిన్‌కు చేరుకున్నారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా రాష్ట్రంలో రూ.6వేల కోట్ల మేరకు స్పెయిన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టే దిశగా పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో స్పెయిన్ పర్యటన ముగిసే సమయంలో ఆయన ఎడిబాన్ కంపెనీతో రూ.540 కోట్ల పెట్టుబడిని సాధించేలా అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో స్టాలిన్, ఆయనతోపాటు వెళ్లిన పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, రాష్ట్ర మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి. విష్ణు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ బి. ఉమానాథ్ తదితరులు మంగళవారం రాత్రి స్వస్థలానికి బయలుదేరారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు స్టాలిన్, అధికారులు నగరానికి చేరుకుంటారు. విమానాశ్రయం వద్ద ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు డీఎంకే పార్టీ ప్రముఖులు, శ్రేణులు సిద్ధమవుతున్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే వాహన పర్మిట్ రద్దు

ప్యారీస్, ఫిబ్రవరి 6: మైనర్లు డ్రైవింగ్ చేస్తే వారు నడిపిన వాహన యజమానికి జరిమానా విధించడంతో పాటు ఆ వాహనం పర్మిట్ (ఆర్సీ)ని సంవత్సరం పాటు రద్దు చేయనున్నట్లు రాష్ట్ర రవాణాశాఖ ప్రకటించింది. కేంద్ర మోటరు వాహనాల చట్టం 2019 ప్రకారం... ప్రమాదాలకు గురయ్యే వాహనాన్ని మైనర్లు కానీ, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు నడిపితే మాత్రమే మృతుడి తరపున కుటుంబ సభ్యులు తగిన నష్టపరిహారం కోరవచ్చు. ఈ చట్టంలో కొన్ని కొత్త విధానాలు చేరుస్తూ 2022 ఏప్రిల్‌లో చట్టసవరణ చేశారు. ఈ నేపథ్యంలో, శివగంగ జిల్లా కారైక్కుడిలో ఉన్న జిల్లా న్యాయస్థానంలో దాఖలైన రోడ్డు ప్రమాదానికి సంబంధించిన పిటిషన్ విచారణకు వచ్చింది. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనాన్ని బాలుడు నడిపారని, అందువల్ల వాహన యజమానికి రూ.26 వేలు జరిమానా విధించాల్సిందిగా ప్రాంతీయ ఆర్టీఏ అధికారికి న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. అంతేకాకుండా, 18 ఏళ్లు నిండని వారు వాహనాలు నడపకుండా వారి తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు రవాణాశాఖ అధికారులు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇకపై మైనర్లు వాహనం నడిపితే, వారి తల్లిదండ్రులకు జరిమానా విధించడంతో పాటు వారి వాహనానికి సంబంధించిన పర్మిట్‌ను రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

4 సీట్లు కోరుతున్న ప్రేమలత?



పీఎంకే నేత డాక్టర్ రాందాస్‌తో చర్చిస్తున్న అన్నాడీఎంకే రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం



బీజేపీ కూటమి వైపు డీఎండీకే!

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): డీఎంకే, అన్నాడీఎంకే కూటములకు ప్రత్యామ్నాయంగా కొత్త కూటమి ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న బీజేపీ.. డీఎండీకేను దరి చేర్చుకునేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఈ కూటమిలో చేరేందుకు టీటీవీ దినకరన్ నేతృత్వంలోని 'అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం', మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం వర్గం, ఏసీ షణ్ముగం నేతృత్వం వహిస్తున్న న్యూజస్టిస్ పార్టీ అంగీకరించాయి. అయితే ఈ కూటమిని మరింత బలోపేతం చేసుకునేందుకు బీజేపీ కసరత్తు చేస్తోంది. అదే సమయంలో ఈ కూటమిలో చేరేందుకు డీఎండీకే కూడా సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత షరతులు విధించినట్లు సమాచారం. తమ పార్టీకి ప్రత్యేక ఓటు బ్యాంక్ ఉన్న నియోజకవర్గాలను కేటాయించాలని కోరినట్టు సమాచారం. అందుకు బీజేపీ నేతలు కూడా సమ్మతించినట్టు తెలిసింది. దీంతో బీజేపీ కూటమిలో డీఎండీకే చేరడం ఖాయమైంది. విజయకాంత్ మరణించిన సమయంలో బీజేపీ పెద్దలు స్పందించారు. అంతేగాక ప్రధాని మోదీ సైతం విజయకాంత్‌ను కీర్తిస్తూ సందేశం పంపారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విజయకాంత్‌కు పద్మభూషణ్ ప్రకటించింది. దీని పట్ల డీఎండీకే శ్రేణులు సైతం ఎంతో సంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ కూటమితో కలిసి సాగడమే మంచిదన్న ఉద్దేశంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఉన్నట్లు తెలిసింది. తమకు కళ్లకుర్చి, మదురై సహా నాలుగు లోక్‌సభ స్థానాలు, రాజ్యసభ సీటు కేటాయించాలని ఆమె బీజేపీ నేతలకు స్పష్టం చేసినట్లు సమాచారం. ఇక అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం నేత దినకరన్ కూడా తమ పార్టీ గెలిచే అవకాశాలున్న 20 నియోజకవర్గాల పేర్లున్న జాబితాను బీజేపీకి సమర్పించినట్లు తెలుస్తోంది.

రాందాస్‌తో సీవీ షణ్ముగం భేటీ...

పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌ను అన్నాడీఎంకే ఎంపీ సీవీ షణ్ముగం ఆకస్మికంగా కలుసుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. సోమవారం రాత్రి దిండివనం సమీపం తైలాపురం గార్డెన్‌లోని రాందాస్ నివాస గృహానికి సీవీ షణ్ముగం వెళ్లి ఆయనతో ఎన్నికల పొత్తుపై చర్చలు జరిపారు. అరగంట సేపు ఈ సమావేశం కొనసాగింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) సూచన మేరకే షణ్ముగం పీఎంకే నేత రాందాస్‌తో పొత్తుపై చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. బీజేపీ కంటే ఎక్కువసీట్లు కేటాయించేందుకు అన్నాడీఎంకే సిద్ధంగా ఉన్నట్లు ఈ సందర్భంగా షణ్ముగం తెలిపారు. బీజేపీ కూటమిలో చేరేందుకు తమ పార్టీకి 22 సీట్లు కేటాయించాలంటూ ఇదివరకే పీఎంకే ప్రతిపాదించింది. అయితే పీఎంకేకు ఏడు సీట్లు మాత్రమే కేటాయిస్తామని బీజేపీ అధిష్ఠానం పేర్కొంది. ఈ విషయాన్ని షణ్ముగం ప్రస్తావిస్తూ తమ పార్టీ ఏడు సీట్ల కంటే ఒకటి రెండు సీట్లు అధికంగా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని రాందాస్ స్పష్టం చేసినట్లు తెలిసింది.

మానవతా పతాకం జాషువా

● ఆచార్య మాడభూషి



ధర్మనిధి ఉపన్యాసాల సంకలనాల ఆవిష్కర్త జేఎం నాయుడు, స్వీకర్తలు గంధం మహేంద్ర, సంగమిత్ర, ఆచార్య విస్తాలి శంకరరావు, రచయిత ప్రణవి, రచయిత్రి తిరుమల ఆముక్తమాల్యద

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సామాజిక అంశాలను పద్యరచనల ద్వారా సమగ్రంగా ప్రస్తావించలేమంటూ మేటి కవులంతా గద్య రచనల బాట పట్టిన సమయంలో కవి కోకిల గుర్రం జాషువా తన అద్భుతమైన పద్యాల ద్వారా సామాజిక సమస్యలను ప్రస్తావించారని నెల్లూరులోని తెలుగు ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకుడు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ కొనియాడారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో మెరీనా రజతోత్సవ ప్రాంగణంలో మంగళవారం ఉదయం ధర్మనిధి ఉపన్యాసాల తొలి సమావేశంలో 'కవి కోకిల జాషువా కవితా సంవేదన' అనే అంశంపై సంపత్‌కుమార్ 'ఆర్కాటు ప్రకాశరావు ధర్మనిధి ఉపన్యాసం' చేస్తూ సమాజంలో వేళ్లూనుకొన్న అస్పృశ్యతను రూపుమాపాలని జాషువా కంకణం కట్టుకున్నారని తెలిపారు. అంబేడ్కర్‌కు- జాషువాకు కొన్ని పోలికలు ఉన్నాయని, ముఖ్యంగా ఇరువురూ బాల్యం నుంచే అంటరానితనాన్ని అనుభవించారన్నారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పెరంబూరు తెలుగు సాహితీ సమితి కార్యదర్శి డాక్టర్ టీఆర్ఎస్ శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

అక్షరరూపం అభినందనీయం...

మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ధర్మనిధి ఉపన్యాసాలను రెండు రోజులపాటు నిర్వహించడమే కాకుండా వాటికి అక్షరరూపం కల్పించి సంకలనాలుగా ముద్రించి వెలువరించడం అభినందనీయమని శ్రీఆంధ్ర కళా స్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు అన్నారు. తెలుగుశాఖ అధ్యక్షుడు విస్తాలి శంకరరావు కొత్తదనం కోరుకునే వ్యక్తి అని, ప్రముఖ కవుల జయంతి వేడుకల సందర్భంగా ఉపన్యాస కార్యక్రమాలు, జాతీయ సదస్సులు కూడా నిర్వహించారని చెప్పారు. ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ సంకలనపరచిన ధర్మనిధి ఉపన్యాసాల సంచికలను జే.ఎం.నాయుడు ఆవిష్కరించి తొలి ప్రతులను గంధం అప్పారావు కుమారుడు గంధం మహేంద్ర, కుమార్తె సంగమిత్రకు అందజేశారు. ప్రత్యేక అతిథి ప్రముఖ రచయిత డాక్టర్ ప్రణవి తను రచించిన 'రసమయి' పుస్తకాన్ని ఆచార్య విస్తాలి శంకరరావుకు అంకితమొనర్చారు. విస్తృతంగా సాహితీ కార్యక్రమాలను కొనసాగించాలని ముఖ్య అతిథి టీఆర్ ఎస్ శర్మ కోరారు.

రచయిత్రి డాక్టర్ తిరుమల ఆముక్తమాల్యద ప్రారంభోపన్యాసం చేస్తూ... గంధం అప్పారావు వంటి సాహితీవేత్తలు, పండిత ప్రముఖులు తమ తర్వాతి కాలంలోనూ సాహిత్యం నిలిచి ఉండాలన్న తపనతో ధర్మనిధిని ఏర్పాటు చేయడం ఆదర్శనీయమన్నారు. సభాధ్యక్షుడు విస్తాలి శంకరరావు మాట్లాడుతూ... ఈ యేడాది నుంచి తెలుగు శాఖలో పీహెచ్‌డీ చేసే విద్యార్థులకు ఆర్థికసాయం అందించనున్నట్లు జేఎం నాయుడు ప్రకటించారని తెలిపారు. డాక్టర్ పాండురంగం కాళియప్ప



సంపత్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

స్ఫూర్తిదాయకంగా ఉండాలి...

స్వాగతంతో ప్రారంభమైన ఈ సమావేశం డాక్టర్ మాదా శంకరబాబు వందన సమర్పణతో ముగిసింది. మధ్యాహ్నం జరిగిన రెండో సమావేశంలో సీనియర్ జర్నలిస్టు డాక్టర్ అరవిల్లి జగన్నాథ స్వామి 'మాడభూషి రచనా వైశిష్ట్యం' అనే అంశంపై ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ ధర్మనిధి ఉపన్యాసం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు తమ్మినేని బాబు మాట్లాడుతూ... ధర్మనిధి ఉపన్యాసాలు ఎంతో విశిష్టమైనవని, వాటి వల్ల విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. మూడో సమావేశంలో మదురై కామరాజర్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ 'తమిళ సాహిత్యంలో మానవతావాదం: పరిచయం' అనే అంశంపై ఆచార్య గంధం అప్పారావు ధర్మనిధి ఉపన్యాసమిచ్చారు. ఈ సమావేశాలలో ఆచార్య ఎల్బీ శంకరరావు, ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ ఎం.ఆంబ్రూణి, డాక్టర్ ఏపీ శివకుమారి, రాజధాని, మీనాక్షి కళాశాలల అధ్యాపకులు ధనుంజయ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమాచార ధ్వని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 6: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు తెలిపింది. ● **తాంబరం:** కడప్పేరి లక్ష్మీపురం, పిళ్లయార్ ఆలయ వీధి, చంద్రానగర్, నాగప్ప నగర్, సీఎల్‌సీ వర్క్స్ రోడ్డు, మాడంబాక్కం అగరం మెయిన్‌రోడ్డు, ముప్పేడు, భారతిదాసన్ వీధి, సెక్రటరీయేట్ కాలనీ, తిరువంజేరి, అన్నై థెరిస్సా వీధి, భారత్ కాలేజ్, శ్రీసాయినగర్, సత్యమూర్తి నగర్, భాయ్ గార్డెన్. ● **అడయార్:** గాంధీనగర్ రెండో మెయిన్ రోడ్డు, పెరుంగుడి సింగారవేలన్ మెయిన్ రోడ్డు, ఎంజీఆర్ రోడ్డు కొంత భాగం, రంగారెడ్డి గార్డెన్, హబీబా వీధి, మేట్టు కాలనీ, ఇంజంబాక్కం అక్కరై విలేజ్, ఎల్జీఅవెన్యూ, ఈసీఆర్ ఏరియా, అల్లికుళం, టీవీఎస్ అవెన్యూ, ఎంజీఆర్ నగర్, కలైంజర్ కరుణానిధి రోడ్డు, కాపర్ బీచ్ రోడ్డు, పనయూర్ టైడర్ పార్క్, చోళమండలం వీధి, పమ్మల్ నల్ల తంబి వీధి, ఉదయం నగర్, తందై పెరియార్ నగర్. ● **కేకేనగర్:** అశోక్ నగర్, ఎంజీఆర్ నగర్, ఈకాట్టు తాంగళ్, కలైమగళ్ నగర్, బాలాజీ నగర్, విశాలాక్షి నగర్, మేర్కు మాంబళం, బృందావన్ ఎక్స్‌టెన్షన్, నక్కీరన్ వీధి, గిండి జాఫర్‌ఖాన్ పేట, నెసపాక్కం, వడపళని, ఆళ్వార్ తిరునగర్, ఆర్కే నగర్, ఇందిరా గాంధీ రోడ్డు, గంగై అమ్మన్ ఆలయ వీధి, రాగూర్ వీధి.

● **పోరూర్:** లక్ష్మీనగర్ 40 అడుగుల రోడ్డు, పిళ్లయార్ ఆలయ వీధి, న్యూ కాలనీ, లక్ష్మీనగర్, అన్నాసాలై, మూర్తి అవెన్యూ, ట్రంక్ రోడ్డు, కోవూర్, మూకాంబిగై నగర్, శ్రీనివాస్ నగర్, అను గార్డెన్, శివశక్తి నగర్, తిల్లై నటరాజా నగర్, చిత్తరాయపురం, ధర్మరాజు ఆలయ వీధి. ● **పెరంబూర్:** కీల్పాక్కం వాటర్ వర్క్స్, గార్డెన్ అయనావరం, ఠాగూర్ నగర్, అన్నా నగర్ ఓ, ఎల్ బ్లాక్‌లు, ఐసిఎఫ్ ఏరియా. ● **రెడ్‌హిల్స్:** సోత్తుపెరుంబేడు, సెక్కంజేరి, నెర్కుండ్రం, అట్టపాళయం, పుదుకుప్పం, కన్నియంపాళయం, జ్ఞాయిరు, తిరుముల్లైవాయల్, ఎల్లమ్మన్ పేట, లక్ష్మీపురం, ఈశ్వరన్ నగర్, పమ్మదుకుళం, పెరియార్ నగర్, సోలయమ్మన్ నగర్.

నేడు, రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 6: మెట్రోరైలు పనుల కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో తాగునీటి సరఫరా ఉండదని మెట్రో వాటర్ బోర్డు అధికారులు తెలిపారు. కోయంబేడు కాళియమ్మన్ ఆలయ వీధిలో ప్రధాన పైప్ లైన్ కనెక్షన్ పనులు చేపట్టనుండడంతో ఆర్కాడు రోడ్డు మీనాక్షి కళాశాల సమీపంలో ఏర్పాటు చేయనున్న పైప్ లైన్ పనుల కారణంగా చూలైమేడు,న్యూఆవళ్లువర్‌కోట్టం ప్రాంతాలు,అన్నానగర్ మండల పరిధిలోని ఎంఎండీఏకాలనీ, అమింజికరై, అరుంబాక్కం, తేనాంపేటమండల పరిధిలోని చూలైమేడు,నుంగంబాక్కం, టి.నగర్, కోడంబాక్కం మండల పరిధిలోని కోయంబేడు, విరుగంబాక్కం, సాలిగ్రామం, వడపళని, కేకేనగర్, అశోక్‌నగర్, వెస్ట్ మాంబళం, సీఐటీనగర్ ప్రాంతాల్లో రెండు రోజుల పాటు తాగునీరు సరఫరా కాదన్నారు. ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని మెట్రో వాటర్ అధికారులు తెలిపారు.

వాషర్‌మెన్‌పేటలో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 6: స్థానిక వాషర్‌మెన్‌పేటలో ఫుట్‌పాత్ నిర్మాణ పనులు జరగనుండడంతో ఎంసీ రోడ్డులో ఈనెల 7న బుధవారం నుంచి పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ మార్పులు అమలులో ఉంటాయని పోలీసులు తెలిపారు. స్టాన్లీ సబ్ వే నుంచి ఎంసీ రోడ్డు మీదుగా వెళ్లే అన్ని వాహనాలు తిరువొత్తియూర్ హైరోడ్డు లేదా మన్నార్‌స్వామి ఆలయ రోడ్డు మీదుగా వెళ్లి గమ్యస్థానాలు చేరుకోవాలి. గుమ్మాలమ్మన్ ఆలయ రోడ్డు, జీఏ రోడ్డు నుంచి ఎంసీ రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలు వెస్ట్ కల్ మండపం రోడ్డు, మన్నార్‌స్వామి ఆలయ రోడ్డు మీదుగా వెళ్లి గమ్యస్థానాలకు చేరుకోవాలి.

తాంబరం - నాగర్‌కోయిల్ రైలు పొడిగింపు

అడయార్, ఫిబ్రవరి 6: స్థానిక తాంబరం నుంచి తిరునెల్వేలి మీదుగా నాగర్‌కోయిల్ వరకు నడుపుతున్న ఎక్స్‌ప్రెస్‌ను మార్చి నెలాఖరు వరకు పొడిగించారు. నాగర్‌కోయిల్ నుంచి తాంబరానికి నడిచే ఈ వారాంతపు ప్రత్యేక రైలు ఈనెల 11, 18, 25, మార్చి 3, 10, 17, 24, 31 తేదీల్లో నడుస్తుంది. ఈ రైలు నాగర్‌కోయిల్‌లో సాయంత్రం 4.35 గంటలకు బయలుదేరి తాంబరంకు మరుసటి రోజు ఉదయం 4.10 గంటలకు చేరుకుంటుంది. అదేవిధంగా తాంబరం నుంచి నాగర్‌కోయిల్‌కు నడిచే ఈ ప్రత్యేక వారాంతపు రైలు 12, 19, 26, మార్చి 4, 11, 18, 25, ఏప్రిల్ 1వ తేదీ వరకు నడుపుతున్నారు. ఈ రైలు ఆదివారం ఉదయం 8.05 గంటలకు బయలుదేరి సోమవారం రాత్రి 08.55 గంటలకు గమ్యస్థానానికి చేరుకుంటుందని దక్షిణ రైల్వే పేర్కొంది.

9న తాంబరం నుంచి జీటీ ఎక్స్‌ప్రెస్

పెరంబూర్, ఫిబ్రవరి 6: రైలు మార్గంలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా చెన్నై సెంట్రల్- న్యూఢిల్లీ- చెన్నై సెంట్రల్ గ్రాండ్ ట్రంక్ (జీటీ) ఎక్స్‌ప్రెస్ రైలు వేళల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నెల 7వ తేది ఢిల్లీలో బయల్దేరనున్న జీటీ ఎక్స్‌ప్రెస్ చెన్నై సెంట్రల్‌కు బదులుగా ఎగ్మూర్ మీదుగా తాంబరం చేరుకుంటుంది. అలాగే, ఈ నెల 9వ తేది తాంబరంలో సాయంత్రం 5 గంటలకు బయల్దేరే జీటీ ఎక్స్‌ప్రెస్ ఎగ్మూర్ మీదుగా గూడూరు చేరుకుంటుంది. ఈ రైళ్లకు రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు తాంబరం, ఎగ్మూర్ స్టేషన్లలో రైలు ఎక్కవచ్చని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

రూ.1.66 కోట్లతో కొలను పునరుద్ధరణ

ఐసిఎఫ్, ఫిబ్రవరి6:తాంబరం కార్పొరేషన్‌లో రూ.1.66 కోట్లతో గ్రంథాలయం,కొలను పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. 4వ మండల పరిధికి చెందిన 53వ వ వార్డులో ఉన్న కొలను, 56వవార్డులో ఉన్న గ్రంథాలయాన్ని పునరుద్ధరించేందుకు కార్పొరేషన్ నిధులు కేటాయించింది.అమృత్ 2.0 పథకం కింద ఈపనులు సోమవారం తాంబరం ఎమ్మెల్యే ఎస్సార్ రాజా ప్రారంభించారు.

రూ.200 కోట్ల ఆస్తిపన్ను వసూలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 6: తుఫాను సమయంలో పన్ను వసూలు చేయడంలో సమయం ఇచ్చిన నేపథ్యంలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పెండింగ్‌లో ఉన్న రూ.200 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్ తెలిపారు. నగరంలో 13.5 లక్షల మంది ఆస్తుల యజమానులున్నారు. వారి నుంచి అర్ధవార్షికానికి రూ.250 కోట్లు పన్ను వసూలవుతోంది. ఈ నేపథ్యంలో, నగరంలో ఇటీవల వచ్చిన తుఫానుకు పన్ను వసూళ్లు జాప్యంగా జరిగాయి. ఇప్పటివరకు రూ.200 కోట్ల వసూలైనట్లు కార్పొరేషన్ తెలిపింది.

నలుగురు జాయింట్ డైరెక్టర్ల బదిలీ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 6: పాఠశాల విద్యాశాఖ వివిధ విభాగాల్లో పనిచేసే నలుగురు జాయింట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ ఆ శాఖ కార్యదర్శి కుమర గురుపరన్ ఉత్తర్వులు జారీ చేశారు. టీఆర్బీ జాయింట్ డైరెక్టర్ అముదవల్లి రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ జాయింట్ డైరెక్టర్‌గా, ఆ సంస్థ జాయింట్ డైరెక్టర్ (పాఠ్య ప్రణాళిక) ఆనంది టీఆర్బీ జాయింట్ డైరెక్టర్‌గా, రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ జాయింట్ డైరెక్టర్ జయకుమార్ మదురై జిల్లా కల్లర్ పునరావాస అసోసియేట్ జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు.

కేంద్ర మంత్రిగా నిత్యానంద అనర్హుడు

● టీఆర్ బాలు ఫైర్
● డీఎంకే సభ్యుల వాకౌట్

అడయార్, ఫిబ్రవరి 6: తమ రాష్ట్రంలో గత యేడాది డిసెంబరులో సంభవించి తుఫానుకు సంబంధించి భారత వాతావారణ శాఖ సరైన ముందస్తు హెచ్చరిక చేయలేదని, అసలు కేంద్ర మంత్రిగా నిత్యానంద రాయ్ అనర్హుడంటూ డీఎంకే లోక్‌సభ విపక్ష నేత టీ.ఆర్. బాలు మండిపడ్డారు. పైగా కేంద్ర మంత్రిగా ఉన్న నిత్యానంద రాయ్ ఎంపీగా అనర్హుడని, ఆయన బాధ్యతగా, క్రమశిక్షణగా నడుచుకోవాలని సూచించారు. దీనికి బీజేపీకి చెందిన కేంద్రమంత్రులు తీవ్రస్థాయిలో ఒక్కసారిగా టీఆర్‌బాలుపై విరుచుకుపడ్డారు. దీంతో డీఎంకే సభ్యులు కూడా ప్రతిగా వాగ్వాదానికి దిగడంతో సభలో గందరగోళం నెలకొంది. మంత్రి నిత్యానందకు టీఆర్‌బాలు క్షమాపణలు చెప్పాలని, ఆయన మాటలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత టీఆర్ బాలు మాట్లాడుతూ... తమ రాష్ట్రానికి వరద సాయాన్ని తక్షణం విడుదల చేయాలని కోరారు. అయితే, బీజేపీ సభ్యులు ఆయన ప్రసంగానికి అడ్డు తగలడంతో డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు డీఎంకే ఎంపీ ఏ.రాజా ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ... గత యేడాదితో పాటు జనవరిలో వరదల వల్ల రాష్ట్రంలో అపారనష్టం జరిగిందని, వరద సాయంగా రూ.37 వేల కోట్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ లేఖల ద్వారా, స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారన్నారు. కానీ, కేంద్రం వరద సాయం విడుదలలో బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఒక విధంగా, తమ రాష్ట్రానికి మరో విధంగా చేస్తోందని పేర్కొన్నారు.

కాఫీతో ఈడీ, ఐటీ అధికారులను ఆహ్వానిస్తాం

● న్యాయశాఖ మంత్రి రఘుపతి



పెరంబూర్, ఫిబ్రవరి 6: 'శరీరంపై బంగారం నగలు లేవు... అందువల్ల ఆ మార్గంలో వెళ్లే సమయంలో భయపడం' అందువల్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చెబుతున్నట్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలకు వస్తే భయపడమని, వారికి కాఫీ అందించి స్వాగతిస్తామని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి రఘుపతి తెలిపారు. పుదుకోటలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... గవర్నర్‌కు పలు బిల్లలు పంపగా, వాటిలో కొన్ని ఆమోదించగా, మరికొన్ని పెండింగ్ ఉంచారన్నారు. జైలులో ఉన్న ముస్లిం ఖైదీలను విడుదల చేసే చర్యలను డీఎంకే ప్రభుత్వం తప్ప మరే రాష్ట్రప్రభుత్వాలు తీసుకోలేదన్నారు. కొడనాడు హత్య కేసులో ఫోరెన్సిక్ అధికారులు తిరుచ్చిలో పరిశోధనలు చేపట్టారని, వారరి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయన్నారు. కొడనాడు కేసును మూడు నెలల్లో పరిష్కారిస్తామని చెప్పిన డీఎంకే ప్రభుత్వం, 36 నెలలు గడిచినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం విమర్శిస్తున్నారని, ఓపీఎస్, ఈపీఎస్‌లు ఇద్దరూ బీజేపీకి బానిసలని, వారివురు పార్టీని బీజేపీకి దాసోహం చేశారని ఎద్దేవా చేశారు. కొడనాడు వ్యవహారాన్ని క్షేత్రస్థాయి నుంచి విచారిస్తున్నామని, సీఎం స్టాలిన్ చేపట్టిన చర్యలతోనే ఈ కేసు ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు.

ఎన్నికలకు ముందుగానే సెమిస్టర్ పరీక్షలు

● ఉన్నత విద్యాశాఖ మంత్రి రాజకన్నప్పన్

పెరంబూర్, ఫిబ్రవరి 6: పార్లమెంటు ఎన్నికలకు ముందుగానే సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని ఉన్నత విద్యాశాఖ మంత్రి రాజకన్నప్పన్ తెలిపారు. నగరంలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... విశ్వవిద్యాలయాల ఉపకులపతులు తమిళం తెలిసిన వారుగా ఉంటే ప్రజలతో చర్చించేందుకు సులభంగా ఉంటుందన్నారు. ఖాళీగా ఉన్న మద్రాసు, భారతీయార్, ఉపాధ్యాయ శిక్షణ విశ్వవిద్యాలయాలకు వీసీలను త్వరలో నియమిస్తామన్నారు. వారు తమిళం తెలిసిన వారుగా ఉంటారన్నారు. సేలం పెరియార్ వర్సిటీ వీసీపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన విచారణ న్యాయస్థానం చేపట్టిందన్నారు.

మెట్రోలో భవన కార్మికులకు అనుమతి నిరాకరణ

● సీఎంఆర్‌ఎల్ తీరుపై వెల్లువెత్తిన నిరసనలు

పెరంబూర్, ఫిబ్రవరి 6: నగరంలో నడుపుతున్న మెట్రోరైళ్లలో భవన నిర్మాణ కార్మికులను అనుమతించక పోవడంపై నిరసనలు వెల్లువెత్తాయి. సెంట్రల్ నుంచి నందనంకు మంగళవారం ఉదయం కొందరు భవన నిర్మాణ కార్మికులు మెట్రో రైలులో ప్రయాణించేందుకు వచ్చారు. కానీ, వారిని ప్రవేశ ద్వారం వద్దే సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. భవన నిర్మాణానికి వినియోగించే కొన్ని పరికరాలు తీసుకెళ్తుండడంతో కార్మికులను అనుమతించమని సిబ్బంది పేర్కొన్నారు. ఈ విషయమై కార్మికులు బతిమాలినా వారు స్పందించలేదు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వెలువడగా, చెన్నై మెట్రోరైలు లిమిటెడ్ తీరుపై నెటిజన్లు నిరసన వ్యక్తం చేశారు.

పదునైన వస్తువులున్నందునే....

భవన నిర్మాణ కార్మికులను మెట్రోరైళ్లలో అనుమతించకపోవడంపై సీఎంఆర్ఎల్ తన 'ఎక్స్'లో వివరణ ఇచ్చింది. కార్మికుల వద్ద గడ్డపార సహా పలు పదునైన పరికరాలుండడంతో భద్రతా చర్యల కారణంగా వారిని అడ్డుకున్నామని, పదునుగా ఉన్న ముందు భాగాన్ని మూసిన తర్వాత, వారిని రైల్లో అనుమతించినట్లు పేర్కొంది.

వేలూరుకు ఆదియోగి రథయాత్ర



ఆదియోగి విగ్రహాన్ని సందర్శిస్తున్న భక్తులు

వేలూరు, ఫిబ్రవరి 6: మహాశివరాత్రిని పురస్కరించుకుని కోవై ఈషా కేంద్రం నుంచి బయల్దేరిన ఆదియోగి రథం వేలూరుకు చేరుకుంది. ఈనెల 10వ తేది వరకు నగరం, శివారు ప్రాంతాల్లో పర్యటించనుంది. అదే సమయంలో కోవై ఈషా కేంద్రంలో మార్చి 8వ తేది జరగనున్న మహాశివరాత్రి వేడుకలను వేలూరులో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈవిషయమై ముత్తన్ననగర్‌లోని ఈషా యోగా కేంద్రంలో దక్షిణ కైలాస భక్తి పేరవై సమూహసేవకుడు మణివన్నన్ మాట్లాడుతూ... గత నెల 5వతేది ప్రారంభమైన యాత్ర నగరంలో ప్రవేశించిందని, ఈనెల 10వతేది వరకు కాట్పాడి, షోళింగర్, ఆర్కాడు, కేవీకుప్పం, గుడియాత్తం, రాణిపేట, తిరుపత్తూరుల్లో రథయాత్ర సాగుతుందని తెలిపారు. కోవైకి వెళ్లి ఆదియోగిని దర్శించుకోలేని ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భక్తి పేరవై సమూహ సేవకులు గుణశీలన్, విజయకుమార్ పాల్గొన్నారు.

అన్నాడీఎంకే సంస్థాగత ఎన్నికలు
జోక్యం చేసుకోలేం : ఈసీ

పెరంబూర్, ఫిబ్రవరి 6: అన్నాడీఎంకే సంస్థాగత ఎన్నికల వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని మద్రాసు హైకోర్టుకు ఎన్నికల కమిషన్ తెలిపింది. దీంతో, సంస్థాగత ఎన్నికలకు సంబంధించిన కేసును తోసిపుచ్చుటున్నట్లు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దిండుగల్‌కు చెందిన సూర్యమూర్తి మద్రాసు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో... అన్నాడీఎంకే సంస్థాగత ఎన్నికలు పారదర్శకత లేకుండా సర్వాధికారంగా నిర్వహించారని, అందువల్ల నిర్వాహకుల ఎంపికకు స్టే విధించాలని పిటిషన్‌లో కోరారు. ఈ కేసులో ఎన్నికల కమిషన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లో... అన్నాడీఎంకే సంస్థాగత ఎన్నికల్లో జోక్యం చేసుకోమని తెలిపింది. ఈసీ వివరణ అనంతరం న్యాయమూర్తి, అన్నాడీఎంకే సంస్థాగత ఎన్నికలు ముగిసి ప్రధాన కార్యదర్శి సహా పలువురు నిర్వాహకులు ఎంపికైనందున, ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేమని పేర్కొంటూ, కేసు తోసిపుచ్చుతున్నట్లు, పిటిషన్‌దారుడు సివిల్ కోర్టుకు వెళ్లొచ్చని ఉత్తర్వులు జారీ చేశారు.

ముల్లైపెరియార్ నీటి విడుదల తగ్గింపు

ప్యారీస్, ఫిబ్రవరి 6: ముల్లైపెరియార్ డ్యాంలో నీటినిల్వలు తగ్గుతున్న కారణంగా ఈ డ్యాం నుంచి తమిళనాడుకు విడుదల చేస్తున్న నీటిని మంగళవారం తగ్గించినట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న ముల్లైపెరియార్ డ్యాం నుంచి రాష్ట్రానికి సోమవారం వరకు సెకనుకు 1,500 ఘనపుటడుగుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టాలు పడిపోవడంతో 500 ఘనపుటడుగుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. అందువల్ల లోయర్ క్యాంప్‌లో ఉన్న పెరియార్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి తగ్గింది. ఈ కేంద్రంలో సోమవారం వరకు 135 మెగావాట్ల విద్యుదుత్పత్తి కాగా, మంగళవారం 45 మెగావాట్లు మాత్రమే జరిగింది. కాగా, మంగళవారం నాటికి డ్యాం నీటిమట్టం 133.30 అడుగులుగా ఉందని, డ్యాంలోకి 436 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు.

వేగంగా తగ్గుతున్న మేట్టూరు డ్యాం నీటిమట్టం...

సేలం జిల్లా మేట్టూరు డ్యాం నీటిమట్టం రోజుకు 0.57 అడుగులకు తగ్గుతోందని, గత శనివారం 70.42 అడుగులుగా ఉన్న నీటిమట్టం మంగళవారం ఉదయానికి 68.85 అడుగులకు తగ్గిందని అధికారులు తెలిపారు. కావేరి డెల్టా జిల్లాల్లో సంబా సాగు కోసం డ్యాం నుంచి 5,600 ఘనపుటడుగుల జలాలు విడుదల చేస్తున్నారు. అందువల్ల ప్రస్తుతం డ్యాంలో 31.71 టీఎంసీల నీరు నిల్వలున్నాయని అధికారులు తెలిపారు.

2026 అక్టోబరు నాటికి మదురై ఎయిమ్స్

● కేంద్రప్రభుత్వం

పెరంబూర్, ఫిబ్రవరి 6: మదురై జిల్లా తోపూర్‌లో ఏర్పాటుకానున్న ఎయిమ్స్ ఆసుపత్రి భవన నిర్మాణాలను 2026 అక్టోబరు నాటికి పూర్తి చేస్తామని కేంద్ర ఆరోగ్య మంత్రి భారతిప్రవీణ్ పవార్ లోక్‌సభలో తెలిపారు. ఈ వ్యవహారంపై మంత్రి అందజేసిన రాతపూర్వక సమాధానంలో.... మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణ తొలిదశ పనులు ముగించడంతో పాటు ప్రహరీ కూడా పూర్తి చేశామన్నారు. ప్రాజెక్ట్ నిర్వహణకు కన్సల్టెన్సీ నియమించి మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేశామని తెలిపారు. 2021లో జైకా సంస్థకు కేంద్రప్రభుత్వానికి మధ్య ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన రుణ ఒప్పందం కుదిరిందన్నారు. జైకా సంస్థ 82 శాతం రుణం, మిగిలినది కేంద్రప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

బయోమెట్రిక్ నిర్ధారించకుంటే పేర్లు తొలగించండి

● రేషన్ దుకాణాలకు ఉత్తర్వులు జారీ

ప్యారీస్, ఫిబ్రవరి 6: కుటుంబ కార్డులో పేర్లున్న అందరూ బయోమెట్రిక్ పరికరంలో వేలిముద్ర నిర్ధారించుకోవాలని, ఈ నెలాఖరులోపు అలా చేయని వారి పేర్లు తొలగించాల్సిందిగా రేషన్ దుకాణాల ఉద్యోగులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.20 కోట్లకు పైగా కుటుంబ కార్డులున్న నేపథ్యంలో, వీటిని రెండు విభాగాలుగా విభజించి అర్హులైన వారికి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. కుటుంబ కార్డులో పేర్లు కలిగిన వారు మాత్రమే రేషన్ దుకాణాలకు వెళ్లి బయోమెట్రిక్ పరికరంలో వేలిముద్ర నమోదుచేసి సరుకులు పొందే విధానం కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, నెలల తరబడి రేషన్ సరుకులు కొనుగోలు చేయని కార్డులు గుర్తించేలా పౌరసరఫరా శాఖ ఇటీవల బయోమెట్రిక్ నిర్ధారించని వారి పేర్లను తొలగించే చర్యలు చేపట్టనున్నట్లు హెచ్చరించింది. బయోమెట్రిక్ విధానానికి ఈ నెలాఖరు వరకు గడువు విధించింది. దీనిపై చౌక దుకాణం ఉద్యోగులు బ్యాంక్‌లలో ఖాతాదారుల వివరాలను నిర్ధారిస్తున్నట్లే రేషన్ దుకాణాల్లో కూడా ఈ విధానాన్ని అమలుపరచేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందుకోసం ఒక్కో రేషన్ దుకాణంలో ఉన్న కుటుంబకార్డుల పేరు, కార్డు నెంబరు, చిరునామా తదితర వివరాలను ముద్రించిన పత్రాలు సరఫరా అయ్యాయని, వినియోగదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాల్సిందిగా దుకాణాల్లో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

నాగై - శ్రీలంక మధ్య నౌకా యానం పునఃప్రారంభించాలి

పర్యాటకుల వినతి

అడయార్, ఫిబ్రవరి 6: నాగపట్టినం నుంచి శ్రీలంక మధ్య ప్రారంభించిన నౌకా ప్రయాణాన్ని పునఃప్రారంభించాలని పర్యాటకులు కోరుతున్నారు. ఈ రెండు ప్రాంతాల మధ్య షిప్పింగ్ కార్పొరేషన్ ప్రారంభించిన నౌకా ప్రయాణానికి ఇరు దేశాలకు చెందిన పర్యాటకులతో పాటు ప్రయాణికుల నుంచి స్పందన వచ్చింది. అయితే, గత యేడాది డిసెంబరులో ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఈ నౌకా ప్రయాణాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. అయితే, జనవరి నెలాఖరు నుంచి తిరిగి ప్రారంభిస్తామని ప్రకటించారు. కానీ, ఫిబ్రవరి ఆరో తేదీ గడిచిపోయినా ఇప్పటివరకు పునరుద్ధరించలేదు. దీంతో ఈ సర్వీసును పునఃప్రారంభించాలని పర్యాటకులు కోరుతున్నారు.

9న డీఎంకే ఎంపీ ఎ.రాజాకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే ధర్నా

ప్యారీస్, ఫిబ్రవరి 6: అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్‌ను కించపరిచేలా మాట్లాడిన డీఎంకే ఎంపీ ఎ.రాజా వైఖరిని ఖండిస్తూ ఈనెల 9న అవినాశి లో ధర్నా నిర్వహించనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. 2జీ స్పెక్ట్రమ్ కేసులో జైలుశిక్ష అనుభవించడంతో పాటు అక్రమంగా ఆస్తులు వెనకేసుకున్న ఎంపీ రాజా చరిత్ర తెలియకుండా ఎంజీఆర్‌ను కించపరిచేలా వ్యాఖ్యానించారని, దీన్ని ఖండిస్తూ 9 ఉదయం 9 గంటలకు అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఈపీఎస్ తెలిపారు.

ఈడీ అధికారి అంకిత్ తివారి బెయిలు పిటిషన్ తోసివేత

ప్యారీస్, ఫిబ్రవరి 6: లంచం కేసులో అరెస్టయిన ఈడీ అధికారి అంకిత్ తివారి తరఫున రెండో సారి దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌ను దిండుగల్ కోర్టు న్యాయమూర్తి మోహన తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దిండుగల్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి అధికారి డాక్టర్ సురేష్‌బాబుతో ఏర్పడిన పరిచయంతో ఓ అవినీతి వ్యవహారంలో నమోదైన కేసు రద్దు చేస్తామని హామీ ఇచ్చి, ఆయన వద్ద రూ.40 లక్షలు అంకిత్ తివారి డిమాండ్ చేసిన నేపథ్యంలో, గత ఏడాది నవంబరు 1వ తేది రూ.20 లక్షలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ పోలీసులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబట్టాడు. ఈ కేసు దిండుగల్ జిల్లా కోర్టులో విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో, అంకిత్ తరఫు న్యాయవాది జ్ఞానసెల్వన్ రెండో సారి బెయిలు కోరుతూ దాఖలుచేసిన పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. న్యాయమూర్తి మోహన సమక్షంలో హాజరైన ఇరుతరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించిన అనంతరం, బెయిలు పిటిషన్ తోసిపుచ్చుతూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

మహాతేజో మండల సభ 26వ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో పాంబన్ స్వామి

వేలూరు, ఫిబ్రవరి 6: స్థానిక కాట్పాడి డివిజన్ గాంగేయనల్లూర్ మహాతేజో మండల సభ 26వ వార్షిక ముగింపు వేడుకలు, 27వ వార్షిక ప్రారంభ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఉన్న కంద పురాణ మండపంలో పాంబన్ స్వామికి ప్రత్యేక అభిషేకం, విశేష అలంకారాలు చేశారు. కార్యక్రమానికి పుగల్‌నార్ అధ్యక్షత వహించారు. అనంతరం పాంబన్ స్వామి ఊరేగింపు జరిగింది. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

జేపీ నడ్డా బహిరంగ సభకు అనుమతి నిరాకరణ

పెరంబూర్, ఫిబ్రవరి 6: నగరంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బహిరంగ సభకు ట్రాఫిక్ పోలీసులు విభాగం అనుమతి నిరాకరించినట్లు సమాచారం. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేపట్టిన 'ఎన్ మన్...ఎన్ మక్కల్' పాదయాత్ర ఈనెల 25వ తేది ముగియనుడంగా, ఆ సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. అంతకు ముందుగా ఈనెల 11న చెన్నైకి రానున్న ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఇందుకోసం పెరుంగుడి, షోళింగనల్లూర్, నందనం తదితర మూడు ప్రాంతాల్లో సభ నిర్వహించేందుకు అనుమతించాలని ఆ పార్టీ పోలీసు శాఖను కోరగా, ట్రాఫిక్ సమస్య దృష్ట్యా ఆ ప్రాంతాల్లో సభ నిర్వహణకు అనుమతించలేదని సమాచారం. అందుకు ప్రత్యామ్నాయంగా షేనాయ్ నగర్‌లో బహిరంగ సభ ఏర్పాటుకు అనుమతించాలని ఆ పార్టీ పోలీసు శాఖకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిసింది.

నేత్ర చికిత్సా ఉచిత శిబిరానికి స్పందన



శిబిరంలో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అరివయగన్

వేలూరు, ఫిబ్రవరి 6: స్థానిక వాసన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా డ్రైవర్లకు నేత్ర చికిత్స ఉచిత శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వాసన్ కంటి ఆసుపత్రి ప్రధాన డాక్టర్ ఫారూఖ్ అహ్మద్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా వేలూరు ట్రాన్స్‌పోర్ట్ శాఖ ఇన్‌స్పెక్టర్ అరివయగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వాసన్ కంటి ఆసుపత్రి వైద్యులు నిరోషా, దివ్య, శశికళ, శరత్, సంతోష్ పాల్గొన్నారు. సుమారు 300 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్రం జోక్యమా?

సుప్రీంకోర్టులో కేరళ సర్కారు పిటిషన్ ● స్టాలిన్ హర్షం

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్రప్రభుత్వ అనవసర జోక్యాన్ని నిరసిస్తూ కేరళ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడాన్ని స్వాగతిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ హర్షం ప్రకటించారు. ఆ మేరకు కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్‌కు ఆయన ఓ లేఖ రాశారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా విజయన్ జరుపుతున్న న్యాయపోరాటానికి తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్రప్రభుత్వం జరుపుతున్న నిధుల వ్యయాలపై కేంద్ర అనవసరమైన ఆంక్షలు ప్రవేశపెట్టడం ఇటీవల అధికమయ్యాయని స్టాలిన్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవసరమైన పథకాలను అమలు చేసే దిశగా అప్పు చేయడం సాధారణమైన విషయమని, అయితే ఆ అప్పులు అందకుండా కేంద్రం అనవసరమైన ఆంక్షలు విధించి రాష్ట్రాల గొంతునులిమేలా నిరంకుశ ధోరణిని ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగ ధర్మాసనం 293వ సెక్షన్ కింద కేంద్రప్రభుత్వం తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని స్టాలిన్ ధ్వజమెత్తారు.

నటి షెరీన్‌కు బెదిరింపు

కారు డ్రైవర్ సహా ఇద్దరి అరెస్టు



చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ సినీ నటి షెరీన్‌ను వాట్సప్‌లో అసభ్యంగా దూషించి బెదిరించిన ఆమె కారు డ్రైవర్, అతడి స్నేహితుడిని పోలీసులు అరెస్టు చేశారు. 'తుల్లువదో ఇలమై', 'జయ', 'స్టూడెంట్ నెంబర్ 1', 'విజిల్' వంటి తమిళ సినిమాల్లో నటించడంతో పాటు బిగ్‌బాస్ సీజన్6లో వేలసంఖ్యలో అభిమానులను సంపాదించుకున్న నటి షెరీన్ స్థానిక రాయపేట ప్రాంతంలో నివసిస్తున్నారు. ఆమె వద్ద కార్తీక్ అనే డ్రైవర్ పనిచేస్తున్నాడు. జనవరి 20న కార్తీక్, అతడి స్నేహితుడు ఇళయరాజా... షెరీన్‌కు వాట్సప్‌లో అసభ్య పదజాలంతో దూషించి తీవ్రంగా బెదిరిస్తూ మెసేజ్‌లు పంపారు. ఈ విషయమై ఆమె అన్నాసాలై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టి కార్తీక్‌ను మైలాడుదురై వద్ద, ఇళయరాజాను చెన్నైలో అరెస్టు చేశారు.

మాజీ ఎంపీ పరశురామన్ మృతి



ఎంపీ పరశురామన్ (ఫైల్ ఫొటో)

ప్యారీస్, ఫిబ్రవరి 6: అన్నాడీఎంకే సీనియర్ నేత, తంజావూరు మాజీ ఎంపీ కె.పరశురామన్(63) అనారోగ్యం కారణంగా చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మంగళవారం మృతిచెందారు. తంజావూరు మెడికల్ కాలేజీ రోడ్డు రెహ్మాన్‌నగర్‌కు చెందిన పరశురామన్ నీలగిరి పంచాయతీ చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన 2014వ సంవత్సరం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తంజావూరు లోక్‌సభ స్థానంలో అన్నాడీఎంకే తరఫున పోటీచేసి డీఎంకేకు చెందిన టీఆర్ బాలుపై 1,44,119 ఓట్ల తేడాతో విజయం సాధించారు. గుండె సమస్యల కారణంగా ప్రైవేటు ఆసుపత్రిలో పరుశురామన్‌ను ఆయన కుటుంబసభ్యులు చేర్పించారు. అయితే చికిత్స ఫలించక మంగళవారం ఉదయం మరణించారు. ఆయన అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం స్వస్థలంలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

నవ దంపతుల ఆత్మహత్య



అరుణ్‌కుమార్-తెన్‌మొళి (ఫైల్ ఫొటో)

వేలూరు, ఫిబ్రవరి 6: వాణియంబాడి సమీపం ఉదయేంద్రానికి చెందిన అరుణ్‌కుమార్, పల్లిపట్టుకు చెందిన తేన్‌మొళి వివాహం ఆరు నెలల క్రితం జరిగింది. ఈ నేపథ్యంలో, సోమవారం రాత్రి తేన్‌మొళి ఉరేసుకుంది. ఈ క్రమంలో, చెన్నై కేకే నగర్‌లో ఉంటున్న అరుణ్‌కుమార్ మంగళవారం ఉదయం ఉరేసుకున్నాడు. ఈ ఘటనలపై ఆయా ప్రాంతాల పోలీసులు విచారణ చేపట్టారు.

15మందిపై వీధి కుక్కల దాడి

ఐసిఎఫ్, ఫిబ్రవరి 6: తిరువళ్లూర్ జిల్లా పళవేర్కాడులో సోమవారం 15 మందిపై వీధి కుక్కలు దాడిచేశాయి. ఈ ప్రాంతంలో మాంసం, చేపల దుకాణాలు ఎక్కువగా ఉన్నాయి. వ్యర్థాలను సక్రమంగా తొలగించకుండా పళవేర్కాడు సమీపంలో ఉన్న కులత్తమేడు - దోనిరేవులకు వెళ్లే మార్గంలో దుకాణదారులు పారబోస్తున్నారు. వీటిని తినేందుకు వచ్చే కుక్కలు అప్పుడప్పుడు పరస్పరదాడులకు పాల్పడుతున్నాయి. ఆ మార్గంలో వెళ్లే వారిని కరవడం, వాహన చోదకులను వెంట బడుతున్నాయి. సోమవారం ఒకేరోజున ఆ మార్గంలో వెళ్లిన 15 మంది కుక్కల దాడికి గురై పళవేర్కాడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఐదుగురు పిల్లలు ఉన్నారు.

విరిగిపడిన సీటు కింది భాగం

● ఎంటీసీ బస్సు నుంచి కిందపడిన మహిళ

పెరంబూర్, ఫిబ్రవరి 6: నగరంలో నడుపుతున్న మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ (ఎంటీసీ) బస్సులోని సీటు కింద భాగం హఠాత్తుగా ఊడిపడడంతో, ఆ రంధ్రం ద్వారా మహిళ కిందపడింది. ప్రస్తుతం నగరంలో నడుపుతున్న ఎంటీసీ బస్సులు అధ్వానంగా ఉన్నాయి. సీట్లు సరిగా లేకపోవడం, కిటికీ అద్దాలు పనిచేయకపోవడం సహా పలురకాల అధ్వాన స్థితిలో ప్రజలు ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మంగళవారం ఉదయం తిరువేర్కాడు నుంచి వళ్లలార్ నగర్‌కు వెళ్తున్న ఎంటీసీ బస్సు అమింజికరై సమీపంలో వస్తుండగా వెనుక సీటు కింద భాగం హఠాత్తుగా ఊడిపడగా, ఆ రంధ్రం నుంచి మహిళ బస్సు నుంచి కిందకు పడిపోయింది. గాయపడిన ప్రయాణికురాలిని అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బేసిన్ బ్రిడ్జి డిపో మేనేజర్, సాంకేతిక ఇంజనీర్ నేతృత్వంలోని బృందం ఈ ఘటనపై విచారించి నివేదిక సమర్పించిన అనంతరం, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు చేపడతామని ఎంటీసీ తెలిపింది.

చోరీ కేసులో నలుగురు నేపాలీయుల అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 6: స్థానిక ఈచంబాక్కంలో ఆలీవ్‌బీచ్ రోడ్డులో నివసిస్తున్న బ్రిజేష్‌కుమార్ అనే పారిశ్రామికవేత్త ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడిన నలుగురు నేపాలీయులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3 కోట్ల నగలు స్వాధీనం చేసుకున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీసులు తెలిపారు. బ్రిజేష్‌కుమార్ ఎక్స్‌పోర్ట్స్ చేస్తుంటారు. వ్యాపారం నిమిత్తం భార్యతో కలసి ఇటీవల జర్మనీకి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది గత నెల 29వ తేది అర్ధరాత్రి బ్రిజేష్‌కుమార్ ఇంట్లో చొరబడి కోట్లాది రూపాయలు విలువ చేసే నగలు, నగదుతో ఉడాయించినట్లు బ్రిజేష్‌కుమార్ బావమరిది అమిత్‌కుమార్ నీలాంగరై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి నిందితులు కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు ఎట్టకేలకు వారి ఆచూకీ తెలుసుకున్నారు. నేపాల్‌కు చెందిన ప్రకాష్, మనోజ్, జనక్‌ప్రసాద్, లలిత్‌కుమార్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3 కోట్ల విలువైన నగలు, రూ.17.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెన్నైకు తిరిగివచ్చిన 12మంది జాలర్లు

అడయార్, ఫిబ్రవరి 6: శ్రీలంక చెరలో ఉన్న జాలర్లలో 12 మంది మత్స్యకారులు చెన్నైకి చేరుకున్నారు. గత నెల 13న సముద్రంలో చేపల వేట కొనసాగిస్తున్న పుదుక్కోటకు చెందిన 12 మంది జాలర్లను లంక నావికాదళం అదుపులోకి తీసుకుంది. ఆ తర్వాత లంక కోర్టులో హాజరుపరచి, జైలుకు తరలించారు. వీరిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం వినతి మేరకు భారత విదేశాంగ మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కొలంబోలోని భారత రాయబార కార్యాలయం చర్యలు తీసుకోవడంతో ఈ జాలర్లను లంక విడుదల చేసింది. ఫలితంగా వీరంతా కొలంబో నుంచి ఎయిర్‌ఇండియా విమానంలో మంగళవారం నగరానికి చేరుకున్నారు. వీరికి ఎయిర్‌పోర్టులో మత్స్యశాఖ అధికారులు స్వాగతం పలికి, ఆ తర్వాత వారిని సొంతూళ్లకు పంపించారు.

తిరుమలలో విల్లుపురంవాసి ఆత్మహత్య?

తిరుమల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో విల్లుపురంవాసి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. తిరుమల టూటౌన్ ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడులోని విల్లుపురం జిల్లా మిట్టమందగపట్టికి చెందిన దండపాణి(82) సోమవారం తిరుమలకు వచ్చాడు. జీఎన్సీ విండ్‌ఫ్యాన్ సమీపంలో మంగళవారం సాయంత్రం ఎలాంటి కదలికలు లేకుండా పడిపోయి ఉండటాన్ని అక్కడి సిబ్బంది గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించగా, అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. పక్కనే విషం బాటిల్ ఉండటంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. జేబులో పాస్‌పోర్టు ఫొటోలున్న కవర్ కనిపించింది. దానిపై ఉన్న అడ్రస్ ఆధారంగా వివరాలను గుర్తించి, కుటుంబీకులకు సమాచారాన్ని అందించారు.

విజయ్‌కు ఆల్‌ది బెస్ట్ చెప్పిన రజనీ

'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన కోలీవుడ్ హీరో విజయ్‌కు సూపర్‌స్టార్ రజనీకాంత్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. చెన్నై విమానాశ్రయంలో ఆయన మీడియా కంటపడ్డారు. ఈ సందర్భంగా విజయ్ రాజకీయ పార్టీపై స్పందన ఏమిటని విలేకరులు ప్రశ్నించగా... 'వాళ్తుగల్' (శుభాకాంక్షలు) అంటూ ఒకే పదంతో సమాధాన ఇచ్చి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, టీవీకే పేరుతో పార్టీని స్థాపించిన విజయ్... రానున్న లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉండి, 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్టు ప్రకటించారు. అలాగే, తాను కమిట్ అయిన సినిమాలను పూర్తి చేసి, ఆ తర్వాత పూర్తిస్థాయి రాజకీయాల్లో నిమగ్నం కానున్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విజయ్‌కు చిత్రపరిశ్రమకు చెందిన పలువురు సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

చిత్రజ్యోతి


రజనీకాంత్

మాస్టర్ మహేంద్రన్ హీరోగా సనా 'ప్రొడక్షన్ నెం.1'


కొత్త చిత్రం పూజా దృశ్యం

మాస్టర్ మహేంద్రన్ హీరోగా సనా స్టూడియోస్ 'ప్రొడక్షన్ నెంబర్-1' పేరుతో ఒక సర్వైవల్ థ్రిల్లర్ మూవీని తెరకెక్కించనుంది. ఈ చిత్రం పూజా కార్యక్రమం మంగళవారం నగరంలో జరిగింది. ప్రముఖ దర్శకుడు, నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్‌తో సినీ ప్రముఖులు చరణ్, అరుణరాజా కామరాజ్, కళ్యాణ్ ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని చిత్ర బృందానికి అభినందనలు చెప్పారు. తమిళ సినీ పరిశ్రమలోకి తొలిసారి అడుగు పెట్టిన సనా స్టూడియోస్ సమర్పణలో రూపొందే ఈ చిత్రానికి నవీన్ గణేష్ దర్శకుడు. ఈయన గతంలో శ్రీకాంత్ నటించిన 'ఎకో' చిత్రాన్ని తెరకెక్కించారు. ఇంకా టైటిల్ ఖరారు చేయని సినిమాను నిర్మాతలు ముత్తు సంతోష్, రవి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మాస్టర్ మహేంద్రన్ సరసన జీవిత హీరోయిన్‌గా కోలీవుడ్‌కు పరిచయమవుతున్నారు. చార్లీ, గుంకీ అశ్విన్, శరత్‌తో పాటు పలువురు నటిస్తున్నారు. అభిషేక్ ఏ.ఆర్. సంగీతం సమకూర్చే ఈ చిత్రానికి రవివర్మ సినిమాటోగ్రఫీని సమకూర్చుతున్నారు. కాగా, ఇటీవల విడుదలైన 'లేబిల్' వెబ్ సిరీస్‌లో మాస్టర్ మహేంద్రన్ తన నటనతో ప్రతి ఒక్కరి ప్రశంసలు పొందారు. చెన్నైతో పాటు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ పూర్తి చేయాలని భావిస్తున్నారు.

అలాంటి ప్రచారం డాడీ చిత్రానికి అవసరం లేదు

● ఐశ్వర్య రజనీకాంత్

వివాదాస్పద, సంచలనం సృష్టించే వ్యాఖ్యలు చేసి తద్వారా తన తండ్రి రజనీకాంత్ నటించిన చిత్రానికి ప్రచారం చేసుకోవాల్సిన అవసరం, అగత్యం తనకు లేదని ఆయన కుమార్తె, సినీ దర్శకురాలు ఐశ్వర్య రజనీకాంత్ అన్నారు. ఆమె దర్శకత్వంలో తెరకెక్కిన 'లాల్ సలాం' ఈ నెల 9న విడుదలకానుంది. విష్ణువిశాల్, విక్రాంత్ హీరోలుగా నటించగా, ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. సీనియర్ హాస్యనటుడు సెంథిల్, తంబిరామయ్య, సీనియర్ నటి నిరోష, జీవిత తదితరులు ఇతర పాత్రలను పోషించారు. లైకా ప్రొడక్షన్స్ బ్యానరుపై నిర్మాత సుభాస్కరన్ నిర్మించగా, ఏ.ఆర్. రెహ్మాన్ సంగీతం అందించారు. రెడ్ జెయింట్ మూవీస్ విడుదల చేస్తోంది. ఈ క్రమంలో సోమవారం చెన్నైలో చిత్ర బృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఐశ్వర్య రజనీకాంత్ మాట్లాడుతూ... 'ఈ చిత్ర ఆడియో ఆవిష్కరణ సమయంలో నేను చేసిన కొన్ని వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సినీవరా ప్రమోషన్‌లో భాగంగానే ఈ తరహా వ్యాఖ్యలు చేశారంటూ ప్రచారం సాగింది. ఈ ప్రచారాన్ని నా తండ్రి ఖండించి, నా వ్యాఖ్యలను సమర్థించారు. ఈ చిత్రం రాజకీయాలకు సంబంధించింది కాదు. ఒక ఊరు, క్రికెట్, రథోత్సవం. ఈ మూడు అంశాల నేపథ్యంలో తెరకెక్కింది. క్రీడలకు మతం రంగు పులమకూడదని చెబుతూనే మతసామరస్యం గురించి చాటిచెప్పే చిత్రం. ఈ సినిమా ఏ ఒక్కరికో, ఏ ఒక్క మతానికో వ్యతిరేకమైనది కాదు. సమాజానికి సందేశమిచ్చే చిత్రం. డాడీ తొలిసారి ముస్లి వేషంలో నటించారు. ఇందులో కథే హీరో. నా తండ్రి లేదా, విష్ణువిశాల్ హీరోలు కాదు. నా పిల్లలు నటన వైపు మొగ్గుచూపుతారో లేదో నాకు తెలియదు. నా తండ్రితో కలిసి పనిచేయడం నాకు ఇష్టం లేదు. కానీ, జరిగిపోయింది. కొన్ని స్టోరీలకు ఏం కావాలో ఆ కథే ఎంపిక చేసుకుంటుంది. అలా డాడీ, జీవిత, రెహ్మాన్‌లు ఈ ప్రాజెక్టులో భాగస్వాములయ్యారు' అని పేర్కొన్నారు. విష్ణువిశాల్ మాట్లాడుతూ... 'సినిమా పరిశ్రమలో విజయానికి మాత్రమే విలువ ఉంటుంది. రజనీకాంత్ కుమార్తె అయినప్పటికీ ఆమెకు అవకాశాలు రాలేదు. ఇవ్వలేదు కూడా. సూపర్ స్టార్ కుమార్తెగా ఐశ్వర్య, ఒక పోలీస్ ఆఫీసర్ కుమారుడిగా నేను అనేక మంచిచెడు సంఘటనలు మా జీవితాల్లో జరిగాయి. ఆ బాధలన్నీ మాకు తెలుసు' అని అన్నారు. అలాగే, విక్రాంత్, నిరోష, తంబిదురై, సెంథిల్ తదితరులు ప్రసంగించారు.


విక్రాంత్ - ఐశ్వర్య - విష్ణు విశాల్

విజయ్ చివరి సినిమాకు వెట్రిమారన్ దర్శకుడు?


వెట్రిమారన్

త్వరలోనే పూర్తిస్థాయి రాజకీయ నేతగా మారనున్న అగ్రహీరో విజయ్ నటించే ఆఖరి చిత్రాన్ని జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ దర్శకత్వం వహించే అవకాశం ఉన్నట్టు కోలీవుడ్ టాక్. నిజానికి వీరిద్దరూ కలిసి పనిచేయాలని ఎప్పటి నుంచో భావిస్తున్నారు. ఈ అభిప్రాయాన్ని వారిద్దరూ వేర్వేరు సందర్భాల్లో వెల్లడించారు కూడా. గతంలో కూడా వెట్రిమారన్ ఈ విషయంపై స్పందిస్తూ... 'మేమిద్దరం కలిసి పనిచేయాలని ఎప్పటి నుంచో భావిస్తున్నాం. ఆయన సిద్ధంగానే ఉన్నారు. కానీ, నా కమిట్‌మెంట్‌ల కారణంగా కార్యరూపం దాల్చలేదు. నేను అంగీకరించిన ప్రాజెక్టులు పూర్తి చేసిన తర్వాత నేను వినిపించే కథ ఆయనకు సరిపోతే ఈ ప్రాజెక్టు కచ్చితంగా కార్యరూపం దాలుస్తుంది' అని పేర్కొన్నారు. అలాగే, వెట్రిమారన్ చిత్రం 'అసురన్'లోని డైలాగ్‌ను స్ఫూర్తిగా తీసుకునే తాను విద్యార్థులను ప్రోత్సహించేలా సాయం చేసినట్టు గతంలో విజయ్ కూడా ప్రకటించారు. ఇపుడు ఆయన రాజకీయాల్లోకి అడుగుపెట్టడంతో తన చివరి చిత్రాన్ని సామాజిక స్పృహ కలిగిన వెట్రిమారన్‌తో తెరకెక్కించాలని విజయ్ భావిస్తున్నట్టు సమాచారం.

'జైన్స్ వెస్ట్‌మినిస్టర్' పునర్నిర్మాణానికి సమ్మతం

● జైన్ హౌసింగ్ కంపెనీ వెల్లడి

అడయార్, ఫిబ్రవరి 6: మద్రాస్ ఐఐటీకి చెందిన నిపుణుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత సాలిగ్రామంలోని జైన్స్ వెస్ట్ మినిస్టర్ బహుళ అంతస్తు సముదాయాన్ని కూల్చివేసి, పునర్నిర్మించేందుకు జైన్స్ హౌసింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ సమ్మతించింది. ఈ బహుళ అంతస్తు భవనంలో క్లోరైడ్ కారణంగా ఏర్పడిన కోత, తుప్పును అంచనా వేసి, శాశ్వత పరిష్కారం చూపించేందుకు వీలుగా మద్రాస్ ఐఐటీ నిపుణుల బృందాన్ని జైన్స్ హౌసింగ్ నియమించింది. ఈ నిపుణుల బృందం జైన్స్ వెస్ట్ మినిస్టర్స్ భవన సముదాయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి కీలక సూచనలు, సలహాలు చేయగా, వీటిని జైన్స్ హౌసింగ్ కంపెనీ సమ్మతించింది. అంతేకాకుండా, ఈ బహుళ అంతస్తు భవనానికి మరమ్మతులు చేయడం లేదా పూర్తిగా కూల్చివేసి తిరిగి పునర్నిర్మించేందుకు వెస్ట్‌మినిస్టర్స్ హౌసింగ్ యజమానుల సంఘంతో గత యేడాది ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా, ఈ భవన సముదాయాన్ని కూల్చివేసి తిరిగి నిర్మించేందుకు సమ్మతించింది. ఈ ప్రాంగణంలో 600 అపార్టుమెంట్లున్నాయి. ఇపుడు ఈ భవన సముదాయాన్ని కూల్చి పునర్‌నిర్మించేందుకు ముందుకు రావడం, తద్వారా తమ విలువైన కస్టమర్ల నమ్మకాన్ని చూరగొనడమే కాకుండా, కస్టమర్లకు ఉన్నతమైన భద్రతను కల్పించేందుకు నిర్ణయించింది. సంబంధిత అధికారుల అనుమతులు లభించిన వెంటనే ఈ పునఃనిర్మాణ పనులు ప్రారంభిస్తామని జైన్స్ హౌసింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది.

వేసవి ఉత్సవాలకు ఊటీ రోజా పార్కు ముస్తాబు


రోజా మొక్కలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ

పెరంబూర్, ఫిబ్రవరి 6: నీలగిరి జిల్లా ఊటీలో 100వ పుష్ప ప్రదర్శన సందర్భంగా 1995లో రోజా పార్కు ఏర్పాటైంది. ఈ పార్క్ ఉద్యానవన శాఖ పర్యవేక్షణలో ఉంది. ఈ పార్కులో నాటే రోజా పూల రకాలు, ప్రపంచంలోని పలు ప్రాంతాల నుంచి తీసుకొస్తుండగా, ప్రస్తుతం 4,210 రకాలకు చెందిన సుమారు 32 వేల రోజా మొక్కలు పర్యవేక్షిస్తున్నారు. 2006లో ప్రపంచస్థాయిలో 'బెస్ట్ రోజా పార్కు' పురస్కారం ఊటీ రోజా పార్కు దక్కించుకుంది. ప్రస్తుతం దక్షిణాసియాలో ఎక్కువ రకాల రోజా చెట్లు ఉన్న పార్కుగా పేరుగాంచింది. శీతాకాలంలో నాటే మొక్కలు ఏప్రిల్ మొదటి వారంలో పూలు పూయడం ప్రారంభిస్తుంటాయి. ఈ నేపథ్యంలో, రోజా పార్కును మంగళవారం జిల్లా కలెక్టర్ అరుణ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ శిబిల మేరి, అధికారులున్నారు. వేసవిలో నిర్వహించే పుష్ప ప్రదర్శన పర్యాటకులను మరింతగా ఆకట్టుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

మాదాకోటలో ఉత్సాహంగా జల్లికట్టు


రంకెలేస్తున్న ఎద్దును అదుపుచేసే ప్రయత్నంలో యువకులు

ప్యారీస్, ఫిబ్రవరి 6: తంజావూరు సమీపంలో మాదాకోటలో మంగళవారం నిర్వహించిన జల్లికట్టు పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. సెయింట్ లూర్దు మాత ఆలయ జల్లికట్టు పేరవై ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను జిల్లా కలెక్టర్ దీపక్‌జాకబ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మైదానంలో ఏర్పాటుచేసిన వాడివాసల్ నుంచి తంజావూరు, పుదుకో, తిరుచ్చి, మదురై, అరియలూరు తదితర జిల్లాల నుంచి నమోదు చేసి 700 పోట్లగిత్తలను బరిలోకి వదిలారు. వాడివాసల్ నుంచి రంకెలేస్తూ మైదానంలో పరుగుతీసిన ఒక్కో గిత్తను అదుపుచేసేందుకు జల్లికట్టు వీరులు సాహసం ప్రదర్శించారు. పోటీలకు ముందుగా పశుసంవర్థక శాఖ అధికారుల సమక్షంలో వైద్యులు, యువకులకు వైద్యపరీక్షలు నిర్వహించగా, జిల్లా యంత్రాంగం తరఫున వారికి టోకెన్లు పంపిణీ చేశారు. ముందుగానే పేర్లు నమోదు చేసుకున్న 400మంది వీరులను ఒక్కో రౌండ్‌కు 50మంది చొప్పున బరిలోకి అనుమతించారు. ఈ పోటీలను తిలకించేందుకు తంజావూరు జిల్లా సహా పొరుగు జిల్లాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పట్టుబడని ఎద్దుల యజమానులు, గెలిచిన వీరులకు బహుమతులు పంపిణీ చేశారు.

నాలుగేళ్ల బాలికకు 15 సెంమీ క్యాన్సర్ కణితి తొలగింపు

అడయార్, ఫిబ్రవరి 6: స్థానిక వడపళనిలోని కావేరీ ఆస్పత్రికి చెందిన వైద్యులు నాలుగేళ్ల బాలికకు పునర్జన్మను ప్రసాదించారు. ఆ బాలిక శరీరంలో ఉన్న 15 సెంటీ మీటర్ల క్యాన్సర్ కణితిని విజయవంతంగా తొలగించారు. కాలేయంలో ఉన్న ఈ క్యాన్సర్ కణితి సంక్లిష్టమైన ఆపరేషన్‌ను కావేరి ఆస్పత్రిలోని అధునాతన జీఐ, హెచ్‌పీబీ సర్జరీ, మల్టీ ఆర్గాన్ విభాగం డైరెక్టర్ డాక్టర్ స్వామినాథన్ సంబంధం సారథ్యంలోని వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ బాలిక జ్వరం, పొత్తికడుపు నొప్పితో ఆస్పత్రిలో చేరగా, ఆమెకు వివిధ రకాలైన వైద్య పరీక్షలు చేసిన తర్వాత కాలేయంలో క్యాన్సర్ కణితి ఉన్నట్టు గుర్తించారు. ప్రస్తుతం బాలికకు కీమోథెరపీ చేస్తున్నామని, ఆరోగ్యం కుదుటపడుతున్నట్టు డాక్టర్ స్వామినాథన్ మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

లోక్‌సభ 'సమరం'పై ముందస్తు ఏర్పాట్లు

● రాష్ట్రాధికారులతో సీఈసీ బృందం చర్చలు
● నేడు కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో సమాలోచన
● ఎన్నికల నిర్వహణ తేదీపై చర్చ



సమావేశంలో ఎన్నికల అధికారులు

అడయార్, ఫిబ్రవరి 6: లోక్‌సభ ఎన్నికలకు భారత ఎన్నికల సంఘం(సీఈసీ) ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన ప్రత్యేక బృందం మంగళవారం ఢిల్లీ నుంచి చెన్నైకి వచ్చింది. ఎన్నికల సంఘం ఉన్నతాధికారి అజయ్ బాదూ సారథ్యంలోని ఈ బృందం సచివాలయానికి చేరుకుని, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహుతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించింది. ప్రధానంగా ఆదాయపన్ను శాఖ, పోలీస్ ఉన్నతాధికారులు, రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం, కస్టమ్స్ ఉన్నతాధికారులతో తొలిరోజు సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. అదేవిధంగా రెండో రోజైన బుధవారం కూడా జిల్లా ఎన్నికల నిర్వహణాధికారి అయిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ చర్చలు జరుగనున్నాయి. ఈ సమావేశానికి సంబంధిత అధికారులంతా సిద్ధంగా ఉండాలని సత్యప్రదసాహు ఆదేశాలు జారీ చేశారు.

గత ఏడాదే...

నిజానికి గత యేడాది డిసెంబరు 8న సీఈసీ రాజీవ్ కుమార్ నేతృత్వంలోని బృందం రాష్ట్రానికి రావాల్సి ఉంది. కానీ, ఆ సమయంలో రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా పర్యటనను వాయిదా వేసుకుంది. ఆ తర్వాత హస్తినలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో రాష్ట్రానికి చెందిన ఉన్నతాధికారులు పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై రాజీవ్ కుమార్ బృందం సూచనలు సలహాలు ఇవ్వడమే కాకుండా, పోలింగ్ కోసం ఉపయోగించే ఈవీఎంలను పోలీస్ కేంద్రాలకు తరలించేలా సిద్ధంగా ఉంచాలని సూచన చేసింది. అలాగే, ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అజయ్ బాదూ నేతృత్వంలో ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ మల్లే మాలిక్ బృందం మంగళవారం ఉదయం 7.45 గంటలకు ఢిల్లీలో బయలుదేరి చెన్నైకు 10.45 గంటలకు చేరుకున్నారు. ఆ తర్వాత సచివాలయానికి మధ్యాహ్నం 12 గంటలకు చేరుకోగా, వారికి సత్యప్రద సాహు స్వాగతం పలికారు. ఆ తర్వాత ఉన్నతాధికారులతో ఈ బృందం ముందస్తు ఏర్పాట్లపై చర్చలు జరిపింది.

తెలుగు భాషా పోషకుడు రామకృష్ణ

● సంతాప సభలో కొనియాడిన వక్తలు


వైవీ రామకృష్ణకు నివాళి అర్పిస్తున్న సమితి నిర్వాహకులు, తెలుగు ప్రముఖులు

ప్యారీస్, ఫిబ్రవరి 6: తెలుగు భాషా పోషకుడిగా, సాహితీవేత్తగా, అభాగ్యులను ఆదుకున్న దాతగా యర్రమిల్లి రామకృష్ణ కీర్తిని మూటగట్టుకొని ఈ లోకం వదిలి వెళ్లారని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక సమితి వ్యవస్థాపకుడు రామకృష్ణ సంస్మరణ సభ మంగళవారం సాయంత్రం టి.నగర్‌లోని బాలానంద విద్యాలయంలో జరిగింది. ముందుగా సమితి అధ్యక్షుడు అజంతా డాక్టర్ కనిగెలుపుల శంకరరావు... వైవీ రామకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం సభలో పాల్గొన్న సమితి నిర్వాహకులు, తెలుగు భాషాభిమానులంతా రెండు నిమిషాలు మౌనం పాటించి వారి ఆత్మకు శాంతి కలగాలని నివాళి అర్పించారు. సభను ఉద్దేశించి అజంతా శంకరరావు మాట్లాడుతూ... తెలుగు భాషాపోషకుడు వైఎస్ శాస్త్రి ద్వితీయ పుత్రుడు యర్రమిల్లి రామకృష్ణ విదేశాల్లో ఉన్నత ఉద్యోగం వదులుకొని మాతృభాషపై మమకారంతో స్వదేశానికి తిరిగివచ్చి పొట్టి శ్రీరాములు స్ఫూర్తిగా చివరి క్షణం వరకు తరించిన మహనీయుడు అని కీర్తించారు. ఆయన ఆర్థికంగా వెనుకబడిన పిల్లల చదువుకు ఫీజులు చెల్లించారని, పలు తెలుగు సంఘాలకు ఆర్థిక సాయం అందజేశారని కొనియాడారు. సాహితీ సేవ, సమాజ సేవలో రాణించిన కీర్తిని మూటగట్టుకొని తిరిగిరాని లోకాలకు వెళ్లారని కీర్తించారు. అనంతరం వైవీ రామకృష్ణ సోదరుడు రామన్ మాట్లాడుతూ... వివాహం చేసుకోవాలని మా కుటుంబ సభ్యులు ఎన్నోసార్లు ఒత్తిడి చేసినా తన సోదరుడు రామకృష్ణ పట్టించుకోకుండా అటు తెలుగు భాషాభివృద్ధికి, సమాజసేవకు కృషి చేశారని, ఆయన సేవలను అలాగే కొనసాగించాలని సమితి నిర్వాహకులను కోరారు. వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి... రామకృష్ణను స్మరిస్తూ పద్యం ఆలపించగా, డాక్టర్ కాసల నాగభూషణం కూడా కవితా నీరాజనం పలికారు. రామకృష్ణ నవలా రచయిత్రి మాలతీ చందూర్ మానసపుత్రుడని కొనియాడారు. ఈ సంతాప సభలో సమితి ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆనంద పద్మనాభమూర్తితో పాటు కల్పన గుప్తా, గుర్రం బాలాజీ, జయశ్రీ, రమణి, డబ్ల్యూటీఎఫ్ కార్యదర్శి శ్రీలక్ష్మీ మోహనరావు, ప్రముఖాంధ్ర సంపాదకుడు గోటేటి వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు రెంటాల జయదేవ్, బాలానంద విద్యాలయ కరస్పాండెంట్ పద్మావతి, గాయని ఎస్పీ వసంత, లావణ్య, శ్రీరాజాలక్ష్మి ఫౌండేషన్ ట్రస్టీ పి.వెంకటరావు తదితరులు పాల్గొని రామకృష్ణతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకాని పలువురు ప్రముఖులు తమ సంతాపం సందేశం పంపించారు. ఇందులో ప్రముఖులు యార్లగడ్డ ప్రసాద్, సీఎంకే రెడ్డి రాలేకపోగా సంతాప సందేశాన్ని పంపించగా, వాటిని కల్పన గుప్తా చదివి వినిపించారు.

మంత్రుల అక్రమార్జన కేసుల విచారణపై

హైకోర్టు సీజేదే నిర్ణయం

● సుప్రీంకోర్టు స్పష్టీకరణ

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులపై నమోదైన అక్రమార్జన కేసులపై ఎవరు విచారణ జరపాలన్న విషయంపై మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిదే తుది నిర్ణయమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర మంత్రులు తంగం తెన్నరసు, ఐ.పెరియసామి, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం, అన్నాడీఎంకే మాజీ మంత్రులు వలర్మతి తదితరులపై నమోదైన అక్రమార్జన కేసులపై విచారణ జరిపిన దిగువ కోర్టు వారిని నిర్దోషులుగా ప్రకటించింది. దిగువ కోర్టులు తీసుకున్న ఆ నిర్ణయాలకు వ్యతిరేకంగా హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ మంత్రులు, మాజీ మంత్రులపై దాఖలైన అక్రమార్జన కేసులను సూమోటోగా పరిగణించి విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఆ విచారణను వ్యతిరేకిస్తూ మంత్రి సాత్తూరు రామచంద్రన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై న్యాయమూర్తులు రిషికేష్‌రాయ్, ప్రశాంత్‌కుమార్ మిశ్రాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం జనవరి 29న విచారణ జరిపింది. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుమతితోనే న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ కేసు నమోదు చేశారా? లేదా? అనే విషయంపై నివేదిక సమర్పించమంటూ హైకోర్టు రిజిస్ట్రార్‌కు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు మద్రాసు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ జ్యోతి రామన్ సుప్రీంకోర్టుకు నివేదికను పంపారు. మంత్రి సాత్తూర్ రామచంద్రన్ తదితరుల అక్రమార్జన కేసుల్లో దిగువ కోర్టులు వారిని నిర్దోషులుగా విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ ప్రధాన న్యాయమూర్తి అనుమతి లేకుండానే సుమోటోగా కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నారని పేర్కొన్నారు. ఆ కేసులకు సంబంధించిన ఫైలును మాత్రమే తాను పరిశీలించినట్లు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారని సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఈ కేసు మళ్లీ విచారణకు వచ్చినప్పుడు మంత్రుల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. మద్రాసు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సమర్పించిన నివేదిక ప్రకారం న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ ప్రధాన న్యాయమూర్తి అనుమతి లేకుండానే సుమోటో కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సుస్పష్టమవుతోందని, ఈ వ్యవహారంలో హైకోర్టులో అయోమయం కొనసాగుతున్నట్లు అవగతమవుతోందన్నారు. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది హైకోర్టు న్యాయమూర్తి సుమోటో కేసుల ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి పరిశీలించారని వాదించారు. అయితే హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నివేదిక ప్రకారం ప్రధాన న్యాయమూర్తి అనుమతి లేకుండానే సుమోటోగా కేసులు నమోదు చేసినట్లు స్పష్టమైందని మంత్రుల తరఫు న్యాయవాదులు వాదించారు. దిగువ కోర్టుల తీర్పులను రద్దు చేసి తాజాగా కేసులు నమోదు చేయడానికి ప్రధాన న్యాయమూర్తి అనుమతి పొందాలన్న నిబంధనను న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ అతిక్రమించారని ఆ న్యాయవాదులు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదప్రతివాదనల అనంతరం సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ సుమోటో కేసులపై ఏ న్యాయమూర్తి విచారణ జరపాలన్న విషయంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తే తుది నిర్ణయం తీసుకోవాలని, అవసరమైతే ఆయనే విచారణ జరపవచ్చునని, లేకుంటే ఇతర న్యాయమూర్తుల ద్వారా విచారణ జరపవచ్చునని తెలిపారు.


చెన్నై, ఎగ్మూర్‌లోని ప్రభుత్వ మ్యూజియంలో ఏర్పాటు చేసిన కరుణానిధి శత జయంతి వేడుకల ఫొటో ఎగ్జిబిషన్, పునరుద్ధరించిన ఆడిటోరియం, హోటల్ తదితరాలను మంగళవారం ప్రారంభిస్తున్న తమిళ అభివృద్ధి, సమాచార శాఖ మంత్రి స్వామినాథన్, ఎమ్మెల్యే పరంధామన్ తదితరులు

మదురై పూర్ణమ్మాళ్ దాతృత్వం

ప్రభుత్వ పాఠశాలకు మరో రూ.3 కోట్ల స్థలం దానం


ప్రధాన విద్యాధికారికి దస్తావేజులు అందిస్తున్న పూర్ణమ్మాళ్

పెరంబూర్, ఫిబ్రవరి 6: మదురైకి చెందిన పూర్ణమ్మాళ్ (53) తన కుమార్తె స్మారకార్థం మరో రూ.3 కోట్ల స్థలాన్ని ప్రభుత్వ పాఠశాలకు దానంగా అందజేశారు. మదురై సర్వేయర్ కాలనీకి చెందిన ఉక్కిరపాండ్యన్, పూర్ణమ్మాళ్ దంపతుల కుమార్తె జనని మృతి చెందడంతో, ఆమె స్మారకార్థం కోడికుళం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పంచాయతీ యూనియన్ పాఠశాలకు తన సొంత స్థలమైన 1.52ఎకరాలను పూర్ణమ్మాళ్ గతంలో దానంగా అందించిన విషయం విదితమే. ఆ స్థలం విలువ రూ.7 కోట్లు. తాను అందజేసిన స్థలంలో తరగతి గదులు మాత్రమే నిర్మించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరగా ఆమె దాతృత్వాన్ని పలువురు అభినందించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీఎం స్టాలిన్ ఆమెకు ప్రత్యేక పురస్కారం అందజేసి గౌరవించారు. ఈ నేపథ్యంలో, అదే పాఠశాలకు మరో 91 సెంట్ల స్థలాన్ని పూర్ణమ్మాళ్ అందజేశారు. ప్రభుత్వ ధర ప్రకారం ఆ స్థలం రూ.22.75 లక్షలు కాగా, బహిరంగ మార్కెట్లో రూ.3 కోట్ల వరకు పలుకుతోంది. స్థలానికి సంబంధించిన దస్తావేజులను పూర్ణమ్మాళ్ ప్రధాని విద్యాధికారి కార్తీకకు అందజేశారు. కాగా, పూర్ణమ్మాళ్ మదురైలో ఓ బ్యాంక్‌లో పనిచేస్తుండగా, ఆమె భర్త ఉక్కిరపాండ్యన్ కొన్నేళ్ల క్రితం మృతిచెందారు.

12 మంది జీవిత ఖైదీల విడుదల

పెరంబూర్, ఫిబ్రవరి 6: రాష్ట్రంలోని పలు జైళ్లలో జీవిత శిక్ష అనుభవిస్తున్న 12 మంది ఖైదీలను విడుదల చేస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. 2021 సెప్టెంబరు 13న ముఖ్యమంత్రి మాట్లాడుతూ... అన్నా 113వ జయంతి సందర్భంగా దీర్ఘకాలం జైళ్లలో జీవితశిక్ష అనుభవిస్తున్న 700 మంది ఖైదీల్లో కొందరిని సత్ప్రవర్తన కారణంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. 2022 జనవరి 11న మాజీ న్యాయమూర్తి ఎన్.ఆదినాథన్ నేతృత్వంలో కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సిఫారసులతో కడలూరు కేంద్ర కారాగారం నుంచి నలుగురు, కోవై జైలు నుంచి ఆరుగురు, వేలూరు, చెన్నై పుళల్ జైళ్ల నుంచి తలా ఒకరు అని మొత్తం 12 మందిని విడుదల చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.